# అభిలాష

టేబిలు మీద ఈ మధ్యనే జరిగిన ఎగ్జిబిషన్‌లో కొన్న హరియానా చేనేత దుప్పటీ, దానిమీద ఓ పక్కగా ఫైల్స్ కోసం ఓ ట్రే, మధ్యనే అందమైన డిజైన్లతో ఉన్న రెండు పేపర్ వెయిట్లూ. కుడి పక్కన ఉన్న స్టూలుమీద మూడు సింహాలు మోస్తున్నట్లుగా ఉన్న నల్లని ఫ్లవర్‌వాజ్‌లో ఫక్కున నవ్వుతున్నట్లున్న తెల్లని పూలూ, ఎడమచేతి వైపుగాఉన్న కిటికీమీద తెల్లని సీసాలో ఉన్నాయా లేదా అన్నట్లుగా ఉన్న నీళ్లలోంచి కిటికీపైకి ఎగబ్రాకుతూన్న నాజూకైన తీగ, కుర్చీకి సరిగా పైన గోడమీద గాంధీ పటం - చిత్తరంజన్ ఫైల్‌లో చివరి కాగితంమీద సంతకం పెట్టేసి తలఎత్తి చూసేసరికి ఆఫీసులా లేని ఆ ఆఫీసరు గది పరీక్షగా చూస్తూన్నాడు శ్రీనివాసరావు.

"సౌందర్యంమీద నీ కింకా ప్రీతి తగ్గిపోలేదన్న మాట" అన్నాడు శ్రీను చిత్తరంజన్ ఫైల్ కట్టేస్తూంటే.

శ్రీను అలా అడుగుతూంటే అచ్చం కళ్యాణి అడిగినట్లే అనిపించింది చిత్తరంజన్‌కి. చిరునవ్వు నవ్వేసి నల్లని పైలట్ పెన్నును జేబుకు తగిలించాడు.

"రూమ్‌కు వెళదామా ... లేకపోతే ఇంకాసేపు ఆఫీసులోనే కూర్చుందామా?" అన్నాడు చిత్తరంజన్.

"అన్నట్టు, నిన్నూ, నీ పరిసరాలూ చూస్తూ అసలు విషయమే మరిచిపోయాను. మా కళ్యాణీ, మా బావగారూ వచ్చారు. బస్‌స్టాండులో ఉంచేసి ఇలా వచ్చాను. ... నిన్ను తీసుకుపోదామని".

"రాస్కెల్, కళ్యాణీని తీసుకుని వచ్చి బస్టాండులో ఉంచుతావా? రూమ్‌కు తీసుకు వెళ్ళలేకపోయావ్. - అక్కడ వెంకటస్వామి ఉంటాడు కదా. నువ్వొక్కడివే వచ్చావేమోనని మామూలుగా..." కోపంగా ఇంకేదో అనబోయాడు చిత్తరంజన్.

"అదికాదు రంజన్! వాళ్ళు ఏడు గంటల ట్రెయిన్‌లో వెళ్ళిపోతారట ఏవో పర్చేజింగ్స్ ఉన్నాయనీ, నిన్ను చూడాలనీ కళ్యాణి అంటే ఇలా వచ్చాను, పద" అన్నాడు శ్రీను.

'నన్ను చూడాలని అందా' అనుకున్నాడు చిత్తరంజన్. పైకి మాత్రం "గొప్ప పనే చేశావ్!" అంటూ లేచాడు బజ్జర్ నొక్కుతూ. ప్యూను వస్తే, "అసిస్టెంట్ మేనేజరుగారిని పిలు" అన్నాడు. మరొక క్షణంలో వచ్చిన అసిస్టెంట్ మేనేజర్‌తో - "ఈ ఫైల్ మీద సంతకం పెట్టేశాను. మరొకసారి వెరిఫై చేసి డిస్పాచ్ చేసెయ్యండి. లేకపోతే ఇన్‌టైమ్‌లో హెడ్డాఫీసు చేరదు." అంటూ వచ్చేస్తూ "అన్నట్లు మీరు ఎల్లో లిల్లీ అడిగారు కదూ. ఎవరిచేతనైనా వెంకటస్వామికి కబురు చెయ్యండి... నే సతనితో చెప్పాను ఇమ్మని. మీ ఇంటికి ముందున్న గార్డెన్‌లో ఆ వేళ కూర్చున్నాం చూడండి, అక్కడే వేయించండి" అని అంటూ వచ్చేసాడు చిత్తరంజన్

ఆశ్చర్యంగా చూశాడు శ్రీను. చిత్తరంజన్‌కి సౌందర్యం మీదున్న ప్రీతికీ, శ్రద్ధకీ.

మేనేజర్‌ని చూసి అప్పుడే కొందరు ఫైల్సు సర్దేస్తున్నారు. కొంతమంది ఫైల్స్‌లో తలలు మరింత దూర్చేసి అతి వినయం ప్రదర్శిస్తున్నారు.

ఆఫీసు బయటికి వచ్చేసరికి చిత్తరంజన్‌కి శ్రీనున్నాడన్న ధ్యాసే పోయింది. అతని ధ్యాస కళ్యాణి మీదకు పోయింది.

హైస్కూల్లోనూ, తరవాత కాలేజీలోనూ కూడా కలిసే చదువు కోవటంవల్ల చిత్తరంజన్‌కూ, శ్రీనుకూ ఒకరింట్లో ఒకరికి మంచి చనువు ఉండేది. హైస్కూల్లో చిన్నతనంవల్ల ఎలా ఉన్నా, కాలేజీకి వచ్చేసరికి మరింత దగ్గరయారు. రోజూ కాలేజీకి వెళ్ళేటప్పుడు శ్రీనుని పిలుచుకుని మరీ వెళ్ళేవాడు చిత్తరంజన్. శ్రీను చెల్లెలే కళ్యాణి. అప్పటికి పధ్నాలుగూ పదిహేనేళ్ల ముగ్ధ. హైస్కూల్లో చదువుతున్న దగ్గర్నుంచీ కళ్యాణిని తెలిసినా, కాలేజీకి వచ్చిన తరవాతనే అంద మంటే ఆరాధన పెరగటంతో కళ్యాణిని చూడకుండా ఉండలేక పోయేవాడు చిత్తరంజన్.

కళ్లనిండా సౌందర్యాన్ని చూస్తే కడుపునిండా భోజనం చేసినంత తృప్తిగా ఉంటుంది చిత్తరంజన్‌కి.

చిత్తరంజన్ ఒక్కోసారి శ్రీను వాళ్ళింట్లో కూర్చుని శ్రీను తోనూ, కళ్యాణితోనూ చాలాసేపు కబుర్లు చెప్పేవాడు.

"నిన్న మంజుల చాలా అందంగా ఉంది కదూ, రంజన్?" అనేవాడు శ్రీను.

"నిజంగా నిన్నటి మంజుల రూపం ఇప్పటికీ నాకు కనిపిస్తూనే ఉంది శ్రీనూ. తలనిండా స్నానం చేసీ, కనకాంబరం పూలు పెట్టీ, తెల్లని మల్లెపూవంటి చీర కట్టీ కళ్లనిండా కాటుక పెట్టిన ఆమెను చూస్తే "

"ఊఁ చూస్తే? ఎలా ఉండేది—కాళికామ్మవారిలానా?" అనేది కోపంగా కళ్యాణి.

"ఇప్పుడు నువ్వు మాత్రం అచ్చం అలానే ఉన్నావు" అనే వాడు శ్రీను.

బుంగమూతి పెట్టుకుని కూర్చునేది కళ్యాణి.

ఒక్కోసారి సన్నజాజులూ, కనకాంబరాలూ, చామంతులూ చక్కగా దండగుచ్చి శ్రీను వాళ్ళమ్మగారి పూజకి ఇవ్వడానికి తెచ్చే వాడు చిత్తరంజన్. ఆడపిల్ల ఆత్రం కొద్దీ కళ్యాణి వాటిని గభాలున లాక్కుని, గుభీమని తల్లో పెట్టేసుకునేది...

"అయ్యయ్యో, ఎంతో సున్నితంగా అందంగా అల్లితే అలా నలిపేస్తున్నావేం?" అని బాధగా అడిగేవాడు చిత్తరంజన్.

"ఆడపిల్లలా పూలు దండ గుచ్చడం తెలుసుగాని, ఆడపిల్ల ఆరాటం తెలియదేం నీకు?" అనేది కళ్యాణి.

కళ్యాణి పదహారో పుట్టిన రోజుకి ఎర్రటి పొడవైన చిన్న పెన్ను ఇచ్చాడు చిత్తరంజన్. దాన్ని కళ్యాణి చేతిలోచూసి, ఆ చెయ్యి అందానికి ఎంతగానో ముగ్ధుడైపోయాడు. చెయ్యే అన్న మాటేమిటి, అప్పటి కళ్యాణి రూపం పేరుకు తగినట్టుగా ఉంది.

ఆ కళ్యాణి రూపంతోపాటు ఆ వేళ కళ్యాణి మాటలు కూడా ఎప్పటికీ మరిచిపోలేడు చిత్తరంజన్.

అందమైన కళ్యాణి రూపం కన్నార్పకుండా చూస్తూంటే సిగ్గుతో అడిగింది.

"ఏమి టలా చూస్తున్నావు?"

"నిజం చెప్పనా? చెప్పినతరవాత కళ్ళు నెత్తిమీదకు తెచ్చుకోకు."

ఆ మాటలకు సిగ్గు ఎగిరిపోయి ఆత్రత చోటు చేసుకుంది కళ్యాణిలో.

“ముఖస్తుతికాదుగాని, నువ్వు ఈవేళ చాలా అందంగా ఉన్నావు నా కళ్లనిండా చూసుకుంటున్నాను.”

కళ్యాణి బుగ్గలు ఎరుపెక్కాయి. ఇంకేమైనా ... చెబుతాడేమో... ఇంకేమైనా ... ఇంకేమైనా అనుకుంటూ ఎంత చూచినా ఏం మాట్లాడ లేదు చిత్తరంజన్.

ఆ వేళ సాయంకాలం ఊరి బయటికి తోటకు ముగ్గురూ వెళ్లారు. చిత్తరంజన్ ఒంటరిగా ఒక చోటికి వెళ్లి అక్కడి నుంచి రెండు కొబ్బరిచెట్ల మధ్యగా ఎర్రని కుంకుమ - అంతటా జల్లుకుంటూ పారిపోతూన్న సూర్యుణ్ణి చూస్తున్నాడు. అతణ్ణి అందుకోవడానికా అన్నట్టుగా రెండు పక్షులు వేగంగా పరుగెడుతున్నాయి. వెనకాలే వచ్చింది కళ్యాణి.

“ఆ దృశ్యం చాలా అందంగా ఉంది కదూ కళ్యాణీ?” అన్నాడు.

“నిజమే. కాని అందాన్ని ఆరాధించేకన్నా, ఆ అందంలో లీనమై పోతేనే అందం ఎక్కువ.”

ప్రశ్నార్థకంగా చూశాడు చిత్తరంజన్.

ఏదో తడబాటును కప్పిపుచ్చుకొని, “మరేం లేదు... ప్రకృతిలో మనమూ కలిసిపోవాలి... ఆ రెండు కొబ్బరిచెట్లగా గాని, ఆ రెండు పక్షులుగా గాని మనం మారిపోతే...” అంది అర్థాంతరంగా కళ్యాణి.

“ఏమో. నాకు ఇప్పటికి మాత్రం అందాన్ని ఆరాధించటంలోనే ఎక్కువ ఆనందం ఉన్నదనిపిస్తుంది. ముందు ముందు నా అభి

ప్రాయం ఎలా మారుతుందో చెప్పలేను. అయితే నువ్వన్నట్టు అందాన్ని అనుభవిస్తే ఆనందానికి చివరి అంచు చేరుకుంటాం. నిజమే. కాని అప్పుడు అందంలో ఆనందాన్ని అన్వేషించాలన్న జిజ్ఞాసపోతుంది. జీవితం చప్పగా ఉంటుంది. అందాన్ని ఆరాధిస్తూ, అందులోనే ఆనందం అన్వేషిస్తూ ఎప్పుడో, ఎక్కడో అందాన్ని అనుభవించాలి. ఇప్పుడు మాత్రం మనది అందాన్ని ఆరాధించవలసిన వయసు. అది నా అభిప్రాయం" అన్నాడు చిత్తరంజన్.

రాత్రి భోజనం వాళ్ళ అమ్మగారి బలవంతాన శ్రీను వాళ్ళ ఇంట్లోనే చేశాడు.

ఆరుబయట చాపలు వేసుకొని నిండు వెన్నెల్లో కూర్చున్నారు.

శ్రీను ట్రాన్సిస్టర్ తెస్తానని లోపలికి వెళ్లాడు. ప్రకృతి తన మేఘాల కొప్పులో జాబిల్లిని అందంగా అమర్చుకొనడానికి ప్రయత్నిస్తూంది.

"నేనంటే నీకభిమానమేనా రంజన్?" అని అడిగింది కళ్యాణి అకస్మాత్తుగా.

"అంటే?" జాబిల్లి కొంపదీసి మేఘానికి దొరికిపోతాడేమోనని చూస్తూ పరాకుగా అడిగాడు చిత్తరంజన్.

"మరేం లేదు. నువ్వు నన్నే విధంగా ట్రీట్ చేస్తున్నావు?" జాబిల్లి బుడుంగున మేఘంలో మునిగిపోయినట్టు చిత్తరంజన్ మనస్సు గందరగోళంలో మునిగిపోయింది ఒక్క క్షణం. గాలి రివ్వురివ్వున వీస్తే మేఘం గమ్మున ఎగిరిపోయి జాబిల్లి తేలిపోయాడు.

"ఫ్రెండ్లీగా......"

ఎక్కడనుంచో వస్తున్న సన్నని సంగీతం, రానురాను దగ్గరై ఎక్కువ శబ్దం కావచ్చింది. చిత్తరంజన్ మాటకో, ఆ శబ్దానికో మరి చెవులు మూసుకుంది కళ్యాణి. "ఏం వాల్యూమ్ తగ్గించేదా ?" అంటూ తగ్గించేసి ట్రాన్సిస్టర్ దూరంగా పెట్టేశాడు శ్రీను.

చిత్తరంజన్‌కి ఉద్యోగం వచ్చి ఆ ఊరు వదిలివేసే రోజున కళ్యాణి కూడా వీడ్కోలు ఇవ్వటానికి స్టేషన్‌కు వెళ్ళింది. శ్రీను హిగ్గిన్‌బాదమ్స్‌కి వెళ్ళాడు.

ఇంకా ట్రెయిన్ రాలేదు. ప్రయాణీకులు హడావిడిగా తిరుగుతున్నారు. చిన్న పిల్లలు ప్లాట్‌ఫారమ్ చివరి అంచుకు వెళ్ళి కొండెక్కినంతగా సంబరపడుతున్నారు. అమ్మలూ నాన్నలూ తిరిగి వారిని తీసుకువెళ్ళి దగ్గర కూర్చోబెట్టుకున్నా, వాళ్ళ మాటల్లో పడగానే జారుకుని తిరిగి ఆ చివరి అంచుకు వెళ్ళిపోయి కేరింతలు కొడుతున్నారు.

చిత్తరంజన్ ఆ పిల్లలనే దీర్ఘంగా చూస్తున్నాడు. కళ్యాణికి కూడా అది చూసి ఏదో చెబుదామనిపించింది.

"చూశావా, రంజన్... ఆనందం ఆ చివరి అంచులో ఉంది. ఎన్నిసార్లు వారించినా వాళ్ళు అక్కడికి వెళ్ళి ఎలా ఆనందిస్తున్నారో చూడు !"

"నిజమే కాని, ఆ తల్లిదండ్రులు చెప్పినంత సేపూ చెపుతారు పడిపోతావు సుమా అని, తరవాత తోడేలూ గొల్లపిల్లవాడి కథలా అవుతుంది" అన్నాడు చిత్తరంజన్.

అయినా ఓడిపోదలుచుకోలేదు కళ్యాణి.

"అలా అనుకుని ఆనందాన్ని చంపుకుంటే జీవితంలో థ్రిల్ లేదు" అంది మళ్ళీ.

"చిత్తరంజన్ ఏమీ మాట్లాడలేదు.

"రంజన్ ... నువ్వెళ్లిపోయే ముందు ఒక్క టడుగుతాను. చెపుతావా?" అంది కళ్యాణి. ఏమిటన్నట్టు చూశాడు చిత్తరంజన్ ఆ చూపు కళ్యాణి చూపుతో పెనవేసుకుపోయింది. మెల్లగా ఆ చిక్కు విప్పి ఆ చూపును దూరంగా రైలు పట్టాలమీద నిలిపాడు.

"నువ్వు జీవితంలో పెళ్లంటూ చేసుకుంటావా?" అని అడిగింది.

పట్టాలమీద నుంచి అతని చూపు సిగ్నల్ పోల్‌మీదికి మళ్లింది. అతను చూస్తుండగానే సిగ్నల్ వాలింది. 'అది దేనికి సిగ్నలా?' అని అనుకున్నాడు. 'తను వెళ్ళడానికే' అని మళ్ళీ సమాధానం చెప్పుకున్నాడు.

"అందాన్ని అనుభవించాలని కోర్కె పుట్టినప్పుడు" అన్నాడు చిత్తరంజన్.

"ఈసారి మిస్ ఇండియా ఫోటో వేశాడు. చూశావా రంజన్?" అంటూ వచ్చాడు శ్రీను చేత్తో పుస్తకం పట్టుకుని.

నిరుత్సాహంగానే చూశారు ఇద్దరూ. అందాన్నెంతగా ప్రేమించినా, అది అందానికి నిజమైన విజయం కాదని వారి ఉద్దేశమేమో!

ట్రెయిన్ వచ్చేసింది. వెళ్లిపోయింది.

ఆ రెండింటికీ పట్టిన పదిహేను నిమిషాల్లోనూ ఆ అందమైన విగ్రహం తనకి కాకుండా పోతుందన్న భయంతోనేమో చిత్తరంజన్‌ని కళ్లార్పకుండా చూస్తూ ఉండిపోయింది కళ్యాణి. భయమే సగం కొంప ముంచుతుంది. నిజంగానే ఆ ట్రెయిను చిత్తరంజన్‌ని ఆమెకు కాకుండా తీసుకుపోయింది.

"ఇందాకటినుంచి నేనే ఏవేవో వాగుతున్నాను కాని, నువ్వు ఒక్క సంగతైనా చెప్పలేదు. అన్నిటికీ ఊఁ కొడుతూనే ఉన్నావు" అంటూ శ్రీను కుడివేసరికి చిత్తరంజన్ ధ్యాస మళ్ళీ శ్రీనుమీద నిలిచింది.

అప్పుడే బస్సుస్టాండు దరిదాపుల్లో ఉన్నారు.

అంతవరకూ లేనిది...కళ్యాణి ఎలా ఉందో అన్న ఆత్రత అతనిలో పెరిగింది. చూసి అప్పుడే ఆరేళ్లయింది. అప్పుడే చలాకీగా, అందంగా ఉండేది కదా. ఇప్పుడు మరింత అందంగా, హుందాగా తయారై ఉంటుంది అనుకున్నాడు చిత్తరంజన్.

అంత దూరంలో ఇద్దరు భార్యాభర్తలు సూట్‌కేసులు కింద పెట్టుకుని మాట్లాడుకుంటూ కనిపించారు. ఆమె చేతుల్లో పండంటి బాబు. దగ్గరకు వెళ్ళగానే చిత్తరంజన్ పోల్చేశాడు కళ్యాణిని. తను అనుకున్నట్టుగానే ఇప్పుడు మరింత అందంగా ఉంది. అయితే తనకు తెలిసిన కళ్యాణికి లేని హుందాతనం ఈ కళ్యాణికి ఉంది—అనుకున్నాడు చిత్తరంజన్.

"ఏం కళ్యాణీ, బాగున్నావా ?" అని పలకరించి, "మీ బాబేనేమిటి...శ్రీను కూడా ఎప్పుడూ చెప్పనేలేదే ?" అన్నాడు చిత్తరంజన్ బాబు నెత్తుకుంటూ.

"ఆఁ బాగానే ఉన్నాం!" అంది కళ్యాణి.

ఆ మాటల్లో ఏం వినిపించిందో ఆశ్చర్యంగా చూశాడు చిత్తరంజన్.

"ఈయన మా బావగారు...రాజగోపాల్. ఇతను నా క్లోజ్ ఫ్రెండ్...చిత్తరంజన్" అంటూ ఈ గొడవల్లోంచి శ్రీను పరిచయాలు చేశాడు.

"ఏం చేస్తున్నారండీ?" అని అడిగాడు చిత్తరంజన్.

"ఆర్ అండ్ బీలో ఇంజనీరుగా పని చేస్తున్నారు" అంది కళ్యాణి.

తనని అడిగితే ఆమె సమాధానం చెప్పినందుకు రాజగోపాల్, వచ్చి రెండు మాటల్లోనే గ్రహించిన ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యంగా చిత్తరంజన్ కళ్యాణి పక్క ఒకేసారి చూశారు.

"అప్పుడే అయిదున్నర కావస్తూంది. ఇంక బయలుదేరుదామా" అని, "రంజన్ సెలెక్షన్‌కి పెట్టింది పేరండి. ఇతని సెలక్షన్లకి తిరుగు లేదు" అని చెప్పాడు శ్రీను.

"అలాంటి వారే నాక్కావాలి నేనూ సెలెక్ట్ చేస్తాను గాని, నా సెలెక్షన్ ఎవరూ మెచ్చుకోరు" అన్నాడు రాజగోపాల్.

ఆ సూట్‌కేసులు రెండూ తన పలుకుబడితో ఓ షాపులో పెట్టించాడు చిత్తరంజన్.

తరవాత నలుగురూ కలిసి బయలు దేరారు.

బాబు నెత్తుకుని, బాబు ముచ్చటల్లో పడిపోయ్యాడు చిత్తరంజన్.

అయినా కళ్యాణిని ఓ కంట కనిపెడుతూనే ఉన్నాడు. ఆమె ప్రవర్తనలో ఏదో వింత కొట్టవచ్చినట్టు కనిపిస్తూంది. బహుశా నేనూ, మా వారూ ఎంతో అన్యోన్యంగా ఉంటూ నీకు కరువైన ఆనందానికి చివరి అంచుల్లో తేలియాడుతున్నాం—అని చెప్పడానికేమో... మాటి మాటికి భర్త భుజంమీద వాలిపోతూండటం, చుట్టుపక్కల ఎవరన్నా సభ్యతా అసభ్యతలని అయినా చూడకుండా భర్తతో గట్టిగా మాట్లాడుతూ గలగలానవ్వటం చేస్తూంది కళ్యాణి. రాజగోపాల్ పాపం,

అతి మంచివాడులా ఉన్నాడు. భార్య వాగుతున్నా అలా వింటూనే ఉన్నాడు. "ఆ కంట్రాక్టర్ వెంకటసుబ్బయ్య బిల్ పాస్ చేశారా?" అనో "మిసెస్ సుబ్రావ్ మొన్న ఏం చేసిందో తెలుసునా?" అనో, "మీ జె. ఇ. ఆ పూడి రోడ్డు ఎస్టిమేట్సన్నీ పారేసుకున్నాడట... నాకు దొరికాయని ఒకసారి, లేదు మిసెస్ రంగనాథం దగ్గర చూశానని మరోసారి చెప్పి, తెగ అల్లరి చేశానని మిస్ అరుణా ఛటర్జీ చెపుతుంటే వినాలీ" అంటూ పగలబడి నవ్వుతూ భర్తమీద వాలిపోతోంది.

"ఏమిటి...కళ్యాణి! ఉన్మత్తురాలిలా ఏమిటిలా ప్రవర్తిస్తూంది" అనుకుంటూ చూస్తున్నారు శ్రీనూ, చిత్తరంజనూ

రాజగోపాల్‌కి కూడా చివరికి విసుగెత్తింది కామోసు- "ఏమిటి ఈవేళ ఇలా పిచ్చిరేగిపోతున్నావు?" అంటూ కసిరాడు.

ఆ మాట కొంపదీసి చిత్తరంజన్ వినెయ్యలేదు కదా అన్నట్టు ఓసారి వెనక్కి తిరిగి చూసి, అతను బాబు ముచ్చటల్లో మునిగి ఉండటం చూసి తృప్తిపడింది.

ఓ షాపులోకి వెళ్లారు అందరూ.

"ఓ మేరేజ్ ఫంక్షన్‌కి వెళ్లాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలుంటే చూపించండి" అని అడిగాడు రాజగోపాల్.

చాలా చూపించారు.

అందులో నాట్యభంగిమలో ఉన్న ఓ అందమైన అజంతా శిల్పం సెలెక్ట్ చేశాడు చిత్తరంజన్. అతనికి తెలుసు - అది కళ్యాణికి తప్పకుండా నచ్చుతుందని. ఓసారి ఎప్పుడో అజంతా శిల్పం చిత్రం పెయింట్ చేసి ఆమెకిస్తే ఆ వేళ ఎంత మురిసిపోయింది!

రాజగోపాల్ ఓ రాధాకృష్ణుల బొమ్మ తీశాడు.

శ్రీను చిత్తరంజన్ చేతిలోని అజంతా శిల్పం బాగుందంటూ తన చేతిలోకి తీసుకున్నాడు. చిత్తరంజన్ ఎత్తుకున్న బాబుకూడా ఆ బొమ్మ చూపిస్తూ కేరింతలు కొట్టాడు.

"అయితే అజంతా శిల్పానికి మెజారిటీ వచ్చేసిందన్న మాట!" అన్నాడు రాజగోపాల్ నవ్వుతూ.

"వద్దులెద్దురూ, ఈ రాధాకృష్ణులే తీసుకుందాం. ఇది బాగుంది. అదీకాకుండా నూతన వధూవరులు ఇలా వుండాలి- అని దీవిస్తున్నట్టుగా ఉంటుంది అదీకాక మనం..." అంటూ గంభీరంగా ఏదో చెప్పుకు పోతూంది కళ్యాణి.

అప్పటికే మతిపోయినట్టు చూస్తున్నాడు చిత్తరంజన్. "నీ లెక్చర్ ఆపు. అలాగే రాధాకృష్ణులే తీసుకుందాంలే. అయ్యో, వాళ్ళదీ గవర్నమెంటు. మరేం చేస్తాం? ఊఁ" అన్నాడు రాజగోపాల్ నవ్వుతూ.

బట్టల షాపుకు వెళ్లారు.

రాజగోపాల్ ఆకాశంరంగు ధర్మవరం చీర బాగుందంటే, చిత్తరంజన్ కనకాంబరం రంగు టెరికాట్ బాగుంటుందన్నాడు.

"అందమొక్కటే కాదు చూడవలసింది. మన్నికకూడా ఉండాలి" అంటూ రాజగోపాల్ సెలెక్ట్ చేసిందే తీసుకుంది కళ్యాణి, ఆదోలా చిత్తరంజన్ పక్కచూస్తూ.

చిత్తరంజన్ ఏ భావమూ వ్యక్తపరచలేదు.

రోడ్డుమీదకు వచ్చేసి, ఓ పక్కగా నిలబడి ఏమిటేమిటి కావాలీ అంటూ రాజగోపాల్ కళ్యాణి చర్చిస్తున్నారు. శ్రీను వాళ్ళ కేదో చెబుతున్నాడు.

చిత్తరంజన్ బాబుతో ఏవేవో మాట్లాడుతూనే ఉన్నాడు.

ఇంతలో "హలో, రంజన్" అని వినిపిస్తే వెనక్కి చూశాడు.

వానిటీబాగ్ ఊపుకుంటూ రాజహంసలా వస్తూంది హేమంత.

కళ్యాణి పక్క చూశాడు చిత్తరంజన్. అంతవరకూ భర్త దగ్గర మారాం చేస్తూన్న కళ్యాణి టక్కున వాగుడు కట్టేసి కళ్లప్పగించి చూస్తూంది హేమంత సౌందర్యాన్ని!

చిత్తరంజన్ వైపు చూసింది కళ్యాణి. ఆలివ్‌గ్రీన్ టెరిలిన్ ఫేంటుమీద కళ్లు చెదిరే వైట్ షర్టు టక్‌చేసిన అతని విగ్రహంతో కళ్లు నిండిపోయాయి. అతని కళ్లు చూసింది. అవి హేమంతనే చూస్తున్నాయి.

ఆ కళ్లలో అందాన్ని ఆరాధించడం కనిపించలేదు. అందాన్ని ఆస్వాదిస్తూండటం కనిపించింది కళ్యాణికి.

అతను తన పదహారో పుట్టిన రోజున తనని దీక్షగా చూడటం జ్ఞప్తికి వచ్చింది. ఆ కళ్ళలో ఆరాధనే ఉండటం కూడా జ్ఞాపకం ఉంది తనకి.

అంతే, కళ్యాణి ముఖం పాలిపోయింది.

"ఈ బాబెవరు? వాళ్లెవరు?" అని అడుగుతోంది హేమంత.

"మీరు నిన్నా, ఈవేళా రాలేదు కాబట్టి దానికి కాంపెన్సేషన్ చెల్లించుకోవాలి. ఏమిటో తెలుసా? రేపు సి. ఎల్. పెడతారో ఏమోగాని, రేపంతా మా ఇంట్లో గడపాలి. వస్తా. బైబై" అంటూ వెళ్ళిపోతున్న హేమంత ఇంకా దూరం కాకముందే మసకబారినట్టు కనిపించింది కళ్యాణి కళ్లకు.

అంతే, ఏడు గంటలకు స్టేషన్‌కు వెళ్లేవరకూ ఒక్క విసరైనా మాట్లాడని కళ్యాణిని చూసి ఈ సారి శ్రీనూ, చిత్తరంజన్‌లతోపాటు రాజగోపాల్ కూడా ఆశ్చర్యపోయాడు.

ట్రెయిన్‌లో కూర్చున్నారు.

"ఇప్పటికైనా అందాన్ని అనుభవించాలన్న కోర్కె నీకు కలిగినందుకు చాలా సంతోషం, రంజన్, విష్ యూ ది బెస్టాఫ్ లక్" అంటూ చేయి ఊపుతూ చిత్తరంజన్ అందమైన విగ్రహాన్ని ఆరాధనా పూర్వకంగా చూస్తూంటే ట్రెయిన్ కదిలింది.

ఆ ట్రెయిన్ ఆ అందమైన విగ్రహాన్ని తనకి కాకుండా చేస్తుందేమోనని ఈ సారి కళ్యాణి భయపడలేదు.

(ఆంధ్ర ప్రభ)